


మండుతున్న ఎండలతో శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన తెలంగాణ చౌక్

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఎండిన పంటలకు రూ.25వేలు, రూ.500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6: రైతు సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలివేయడంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారని, ఎండిన పంట పొలాలకు ఎకరాకు 25వేల రూపాయలు, క్వింటాల్ ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారితో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్ రైతు పక్షపాతి పంటల పెట్టుబడి సాయంగా రైతుబంధు ఇచ్చారని, ముందు చూపుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడంతో మండుటెండల్లో సైతం మిడ్ మానేరు, ఎల్ఎండీ, వరదకాలువలతో పాటు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయని, సాగు, తాగునీటికి ఇబ్బందులు లేవని అన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను ఇచ్చారని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు 15వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, రెండు లక్షల రుణమాఫీ చేయలేదని, కరెంటు కష్టాలు, సాగునీరు లేక పంటలు ఎండి పోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. కరీంనగర్‌లో రోజు తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు 15వేల రైతుబంధు, రెండు లక్షల రుణమాఫీతో పాటు ఎండిన పంటలకు 25వేల పరిహారం, యాసంగి పంటకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని, రైతులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేదాక విడిచిపెట్టే ప్రసక్తి లేదని వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీంద ర్‌సింగ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతు నిరసన దీక్షలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, నాయకులు

కాళేశ్వరం అవినీతిపై

సీబీఐ విచారణ చేపట్టాలి

- నా ఫోన్‌ను ట్యాపింగ్ చేశారు
- కేసీఆర్ కుటుంబం తీసుకున్న నయీం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- నేతన్నలకు మద్దతుగా 10న సిరిసిల్లలో దీక్ష
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరపాల్సిందేనని, కేసీఆర్ కుటుంబానికి సాగు నీటి ప్రాజెక్టులు ఏటీఎంలాగా మారాయన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని, ఫోన్ ట్యాపింగ్‌కు కారణమైన కేసీఆర్ కుటుంబంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం నాఫోన్‌ను ట్యాపింగ్ చేసిందన్నారు. బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుకున్నవి సైతం ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారన్నారు. రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావులు మా పార్టీ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేసి కార్యకర్తలపై థర్డ్ డిగ్రీలు ప్రయోగించారని అన్నారు. కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే అధికారులు అదే ఫోన్ ట్యాపింగ్‌తో బెదిరించి ఆస్తులు దండుకున్నారన్నారు. అధికారులు ప్రభుత్వం ఒక్క ఫోన్ ట్యాప్ చేయమంటే వారు వ్యాపారులవి, అధికారులవి ఫోన్ ట్యాప్ చేసి ఆస్తులు దండుకున్నారన్నారు. నయీం ఆస్తులు కేసీఆర్ కుటుంబం దోచుకుందని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ వ్యవహారంపై సిట్ విచారణ కొనసాగించాలన్నారు. డ్రగ్స్, మియాపూర్ భూముల కుంభకోణంపై విచారణ చేపట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకే దిక్కులేదని, మళ్లీ పాంచ్ న్యాయ్‌పేరుతో హామిలిస్తుందన్నారు. నేతన్నలకు మద్దతుగా ఈ నెల 10వ తేదీన సిరిసిల్లలో దీక్ష చేపట్టనున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు మోసపూరిత పార్టీలేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాటు 30 లక్షల ఎకరాల్లో పంట నష్టపోతే ఏనాడూ సాయమందించ లేదన్నారు. పది సంవత్సరాల్లో 11 లక్షల మంది రైతులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని ఆదుకోలేదన్నారు. ఇప్పుడు రైతుల పక్షాన మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. గతంలో వడగండ్ల వానతోనష్టపోయిన రామడుగు మండలం లక్ష్మీపూర్‌కు వచ్చి ఎకరాన పది వేలు ఇస్తామని ఒక్కపైనా ఇవ్వలేదన్నారు. పదేళ్లు సీఎంగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్ మాట్లాడే భాష ఏమిటని ప్రశ్నించారు. సిరిసిల్లలో వరి కుప్పలపై రైతులు చనిపోయినా పట్టించుకోలేదన్నారు. ఫసల్ బీమా అమలు చేయ లేదని, సమగ్ర పంటల బీమా పథకాన్ని ఎందుకు అమలుచేయలేదన్నారు. రైతులకు లక్ష రుణ మాఫీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, వరికి 500 బోనస్, మహిళలకు 2500, గ్యాస్, ఆసరా పింఛన్లు, రుణమాఫీ, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు అమలు ఎందుకు చేయడంలో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలకు లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. సమావేశంలో మాజీ మేయర్ డి శంకర్, మాజీ డిప్యూటి మేయర్ గుగ్గిళ్లపు రమేష్, చెన్నమనేని వికాస్‌రావు, వాసాల రమేష్, కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, పాల్గొన్న నాయకులు

బీజేపీని ఓడించేందుకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 6: బీజేపీని ఓడించేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమి బలపడాలంటే సీపీఐకి కొన్ని పార్లమెంట్ స్థానాలుకేటాయించాలన్నారు. పది సంవత్సరాలుగా బీజేపీ నిరంకుశంగా దేశసంపదను బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, పౌరుల హక్కులను, చట్టాలను మార్చివేసిన ఘనత బీజేపీదన్నారు. దేశవ్యాప్తంగా అనేక మందిపై ఈడి, ఐటి, సీబీఐ దాడులు చేయిస్తుందని, ఒక్క బీజేపీ నాయకునిపై దాడులు ఎందుకు కావడం లేదని ప్రశ్నిం చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

రాజకీయాలను భ్రష్టుపట్టించిన ఘనత కేసీఆర్‌దే

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను భ్రష్టుపట్టించిన ఘనత కేసీఆర్‌దేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్‌పార్టీ అన్నారు. 2007లో గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని మాట ఇచ్చిన కేసీఆర్ మాట తప్పారన్నారు. స్వార్థ పూరితంగా ఆలోచించి 2016లో ప్రారంభించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు పూర్తి చేయలేదా అని ప్రశ్నించారు.

అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు అందిస్తున్న సంతాన సాఫల్య కేంద్రం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతి ఒక వరం లాంటిదని పద్మజ సంతాన సాఫల్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పద్మజ తెలిపారు. శనివారం ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సంతాన సాఫల్యంలో అద్భుత ఫలితాలు సాధించడం కరీంనగర్‌లోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రానికే దక్కుతాయన్నారు. 25 సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు ఇస్తున్న సంతాన సాఫల్య కేంద్రం తమదేనని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి వచ్చి సంతానం పొందిన దంపతులు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఒకే రోజులో ఒకే కాన్పులో ఇద్దరు, ముగ్గురు సంతానం కలిగిన దంపతులు ఉన్నారని తెలిపారు. వారం దరినీ ఈరోజు ముందుకు తీసుకు వచ్చామన్నారు. పిల్లలు లేని దంపతులకు స్త్రీ, పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా ఐవీఎఫ్ ఒక అద్భుత వరమన్నారు. ఐవీఎఫ్ విధానంలో భార్య అండాశయం నుంచి అండాలను బయటకు తీసి, భర్త వీర్యకణాలను అండంలోకి ఇంజెక్ట్ చేసి ఇంక్యుబేట్ చేస్తామని తెలిపారు. మూడు రోజుల తరువాత ఫలదీకరణ చెందిన పిండాన్ని తిరిగి గర్భాశయంలో ప్రవేశ పెడుతామని పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతి కోసం వినియోగించే పరికరాలు అన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. అయితే వాటితో వైద్యం చేయడం కూడా ఖర్చుతో కూడుకున్నదన్నారు. అంతర్జాతీయ సక్సెస్ రేటు 35 శాతం నుంచి 40 శాతం కాగా, ఇక్కడ 70 నుంచి 75 శాతం సక్సెస్ ఇస్తున్నామన్నారు. తమ సక్సెస్ రేటును చూసే దేశ విదేశాల నుంచి తమ వద్దకు సంతానం కోసం వస్తున్నారని తెలిపారు. గర్భధారణ అయినవారి కళ్లల్లో ఆనందం చూశాక తాము పడిన శ్రమ మర్చిపోయి తిరిగి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుందన్నారు.

ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, ఆటంకాలను దాటుకొని పర్టిలిటీలోని ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ మాతృత్వాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నో ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నప్పటికీ వస్తున్న ఫలితాలే తమ అభివృద్ధికి సోపానాలని పేర్కొన్నారు.


పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో ఒకే రోజు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మాతృత్వం పొందిన మహిళలు

అక్రమ నిర్మాణం తొలగింపు


అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

జమ్మికుంట, ఏప్రిల్ 6: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతినగర్‌లో అక్రమ నిర్మాణం చేపట్టారని వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు శనివారం దానిని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎండి ఆయాజ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధి లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పట్టా భూముల్లో నిర్మాణ అను మతుల కోసం టీఎస్ బీపాస్‌కు కావాల్సిన డాక్యుమెంట్లు సమర్పించాలన్నారు. ఎలాంటి అను మతులు లేకుండా నిర్మా ణాలు చేపడితే కూల్చి వేయడం జరుగుతుం దన్నారు. కార్య క్రమంలో ఏఈ వరుణ్, టీపీఎస్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తుక్కుగూడ జనజాతరకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 2: తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన జనజాతర బహిరంగ సభకు కరీంనగర్ నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 వాహనాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు తుక్కుగూడకు బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాల ర్యాలీని నగర కాంగ్రెస్ కార్యాలయం వద్ద సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్య క్రమంలో నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తుక్కుగూడ బహిరంగ సభకు వెళ్లే వాహనాలకు పార్టీ జెండా ఊపి ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

నేడు ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6: జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ వివిఎస్ జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే 6వ తరగతి పరీక్షకు 2,234 మంది విద్యార్థులు హాజరవుతుండగా వారి కోసం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7 నుంచి 10వ తగరతి వరకు మిగిలి యు న్న సీట్లకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగే పరీక్షకు 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ పొందాలని, హాల్ టికెట్ లలో ఏమైనా తప్పులుంటే ఆధారాలతో పరీక్షా కేంద్రా ల్లో సరిచేస్తారని అన్నారు. హాల్ టికెట్లలో ఫొటోప్రింట్ రాని విద్యార్థులు పాస్‌పోర్టు సైజు ఫొటో జత చేసి వారికి సంబంధించిన గుర్తి ంపు ఆధారాలతో పరీక్షా కేంద్రాల్లో ఇస్తే పరీక్షకు అనుమతిస్తారని అన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్6: ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఎంపీ స్థానాల నుంచి 303 సీట్లకు ఎదిగి నేడు 400 సీట్లు కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తుందన్నారు. మోదీ సారథ్యంలో నవభారత నిర్మాణానికి నాంది పలికిందన్నారు. బీజేపీ 2014, 2019లో వరుస విజయాలు నమోదు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్; మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, గుగ్గిళ్ల రమేష్, మేకల ప్రభాకర్ యాదవ్, ఉప్పు రామక్రిష్ణ, వైద రామానుజం, అలివెళ్లి సమ్మిరెడ్డి, జానపట్ల స్వామి, సిద్ది సంపత్, దండు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ క్యాక్రమలో నరహరి లక్ష్మారెడ్డి, కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, గోదారి నరేష్, కదారి మహేశ్వర్‌రెడ్డి, పింగిలి ప్రతాపరెడ్డి, పీచర విష్ణు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. శివారులోని ఓ కొట్టంలో పేకాట ఆడుతున్నట్లు ఎస్సై నవీన్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. ఐదుగురి నుంచి రు. 7,200లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 6: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన నాగుల సతీష్‌కు చెందిన గొర్రెలు పుట్ట గంగాధర్‌కు చెందిన వరి పొలంలో మేశాయి. ఈ విషయంలో 3వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించి మాట్లాడుతుండగా సతీష్ కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టి అవమానించాడని గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబరాబాద్‌లో బాలిక కిడ్నాప్

- జగిత్యాలలో సంచారం, నలుగురిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 :హైదారాబాద్ పట్టణంలోని సైబరాబాద్‌కు చెందిన ఓ బాలిక కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది. అయితే కిడ్నాప్‌నకు గురైన బాలిక కొన్ని రోజులుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సంచరిస్తున్నట్లు జగిత్యాల పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జగిత్యాలతో పాటు మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం



భూషణరావుపేటలో దగ్ధమైన హార్వెస్టర్

కథలాపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని భూషణరావుపేటలో శనివారం ఉదయం విద్యుత్ తీగలు తగిలి రాగుల రవి అనే యజమాని హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. గన్నెడ్డి కుంట శివారులో ఓ రైతుకు చెందిన వరి పొలం కోస్తుండగా పైభాగంలో ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగలు తగిలాయి. వైర్ల నుంచి నిప్పురవ్వలు ఇంజిన్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. వరి పొలంలోనే మంటలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన రైతులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వ్యవసాయానికి సంబంధించిన వైర్లను చూసు కుని హార్వెస్టర్ యజమానులు వరి కోతల పనులు చేపట్టాలని విద్యుత్ అధికారులు సూచించారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి అవకాశం ఉంటుం దన్నారు. సంఘట నా స్థలాన్ని ఎస్సై నవీన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు పరిశీలించారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తాకి యువకుడి మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్‌లో శనివారం ఓ వ్యాన్ రివర్స్ వస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి దానిని అనుకుని ఉన్న దొడ్ల గంగాదర్ అనే యువకుడు మృతి చెందాడు. మియాపూర్ గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో షెడ్డు నిర్మించుకుంటున్న సందర్భంలో దానికి అవసరమైన సిమెంట్ బ్రిక్స్‌ను గోదావరిఖని నుంచి వ్యాన్‌లో తెచ్చారు. వ్యాన్ పొలంలో దిగబడి పోవ డంతో వేరే ట్రాక్టర్ తెచ్చి ఇటుకలను ఇదే గ్రామానికి చెందిన హమాలీ పని చేసే దొడ్ల గంగాదర్(27) పనిస్థలానికి తరలించారు. తిరిగి వ్యాన్ రివర్స్ వెళుతుండగా గంగాధార్ దాన్ని తాకుతూ నిలుచున్నాడు. పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లు వ్యాన్‌పై బాగంలో తాకి షాక్ రావడంతో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్



మాట్లాడుతున్న హెచ్‌వోడీ ప్రభాకర్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: ఇంజనీరింగ్ విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 1న ప్రారంభమైన డీజీటల్ డీజైన్ అండ్ వెరీ లాగ్ ముగిసింది. ముగింపు సమావేశంలో ఈసీఈ హెచ్‌వోడీ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు వివిధ విబాగాల్లో డీజైన్ ఎనాలసీస్ వెరిఫికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ వెరీ లాగ్‌లో కోడింగ్ స్కిల్స్ ఏవిధంగా తర్ఫీదు అవ్వాలో నేర్పించామన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండ కష్టపడి చదువుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన డా.. సనత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో జ్ఞానాన్ని సంపాదించుకుంటూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. బారత దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ ముగింపు సమావేశంలో కో కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డీనేటర్ శ్రీనివాస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన ఇద్దరిపై కేసు

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: విలేకరులమని తమకు రూ.10వేలు ఇవ్వాలంటూ రేషన్ డీలర్‌ను బెది రించిన ఇద్దరు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తిలక్‌నగర్, ఫైవింక్లయిన్‌లో రేషన్ షాపు నిర్వహించే అవినాష్‌ను సురేష్, శివ అనే ఇద్దరు తాము విలేకరులమని, రూ.10వేలు ఇవ్వాలంటూ బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. బాధితుడిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలి



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మధురానగర్‌లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం ఎక్కడ పొలాలు ఎండిపోలేదని చెప్పడం సరి కాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రేండ్ల శ్రీనివాస్, నారాయ ణ ,రాజశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీశ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మృత్యు శకటం

- విద్యార్థులను బలితీసుకున్న అతివేగం
- బోల్తా పడిన మొరం టిప్పర్
- మట్టిలో కూరుకుపోయి ముగ్గురు దుర్మరణం
- అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి
- బోర్నపల్లిలో విషాదం




విజయ్, వర్ష, సింధుజా మృతదేహాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 6: పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణం అవు తున్న వారిని విధి వెంటాడింది. మొరం టిప్పర్ రూపంలో ముగ్గురు చదువుకునే విద్యార్థులను మృత్యువు కబళించింది. మోటర్ సైకిల్‌పై ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో మొరం టిప్పర్ బోల్తా పడడంతో అదే మట్టిలోనే కురుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ హృదయ విదారక సంఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హుజూరాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంట విజయ్ (17), గంట వర్ష (15), గంట సింధుజా (18) హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిద్ర వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. ముగ్గురు కలిసి మోటర్ సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఎలబోతారం నుంచి ఎదురుగా వస్తున్న మట్టి టిప్పర్ గమనించారు. మూల మలుపు ఉండడంతో విజయ్ మోటర్ సైకిల్‌ను నిలిపివేశాడు. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ వారిని ఆకస్మాత్తుగా గుర్తించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్న ఉన్న ముగ్గురు మట్టిలో కురుకుపోయి శ్వాస అందకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు ఎక్స్‌కావేటర్ సహాయంతో మృతదేహాలను వెలికి తీసి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు విజయ్, వర్ష, బంధువు సింధుజా మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు, స్థాని కులు కంట తడి పెట్టారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము క న్నాయి. గంట విజయ్ ఇంటర్, వర్ష పదో తరగతి, సింధుజా డిగ్రీ చదు వుతున్నారు. హుజూరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● అతివేగంతో ఇబ్బందులు..

నేషనల్ హైవే పనులు జరుగుతుండడంతో టిప్పర్ డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 టిప్పర్లతో



బోల్తా పడిన టిప్పర్

సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని గుట్టల్లో నుంచి మట్టిని తరలిస్తున్నారు. అనుభవం లేని యువ డ్రైవర్లతో టిప్పర్లు నడుపుతుం డడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా టిప్పర్ డ్రైవర్లు కార్లు, మోటర్ సైకిళ్లను ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. బోర్నపల్లిలో జరిగిన సంఘటనతో పోలీసులు కళ్లు తెరిచి డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

● మృతుల కుటుంబాలకు పరామర్శ..

బోర్నపల్లిలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

- రూ.16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లు స్వాధీనం

- జిల్లా వ్యాప్తంగా 14కేసులు నమోదు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ, ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వ్యాపారుల ఇళ్లపై శనివారం 24పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాడులుచేసి రూ. 16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకొని 14కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన నిబంధనలకు లోబడి ఫైనాన్స్ నిర్వహించాలని చెప్పారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరంకు మించి అధిక వడ్డీలకు అప్పుచేసి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే విశ్వసించాలని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయినా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపే వారి వివరాలు జిల్లా పోలీసు కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదుచేసినా చర్యలు ఉంటాయని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. అప్పు తీసుకోవడం , ఇవ్వడం నేరం కాదని, ఆర్‌బిఐ నిబంధనలు , మనిలెండింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం చట్టబ ద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వొచ్చన్నారు. చట్ట విరుద్ధంగా అధిక వడ్డీ రేట్లతో సామాన్యులై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సుమారు పది మంది వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నగదు, ప్రామిసరీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వడ్డీ వ్యాపారులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అధిక వడ్డీకి నగదు ఇస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక డీఎస్పీ కే నాగేంద్ర చారితో కలిసి చేపట్టిన ఈ దాడులలో భాగంగా పట్టణంలో పలువురు వడ్డీ వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, నాయుడు, పృధ్విగౌడ్, జ్యోతి తదితరులు తనిఖీలలో పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు

శంకరపట్నం, ఏప్రిల్ 6: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన చిత్తూరి కిరణ్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి చెప్పారు. కిరణ్ వద్ద నుంచి 4.355లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లు సమాచారం వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 6: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన అంబాల సమ్మయ్య రెండు రోజుల క్రితం ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవ పడి వెళ్లి పోయాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. బంధువుల ఇళ్లల్లో గ్రామంలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివాహిత అదృశ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: భర్తతో గొడవపడిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మనిషా(25) ఈనెల 3న తన భర్తతో గొడవ పడి రాత్రి 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదే గ్రామంలోని బంధువుల ఇంటిలో ఆశ్ర యం పొందింది. 4న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన అత్త ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిన మనీషా బయటకు వెళ్లి ఇంతవరకు ఆచూకీ లేకుండా పోయిందని ఆమె తండ్రి దాసరి నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మనీషాకు ఇద్దరు కొడుకులు ఉన్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఇందులో నుంచి ఒకరికి ఏడు రోజులు, ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. మిగతా 18 మంది వాహనదారులకు 31 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వాగులో మునిగి కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి షిడం పోశం(40) అను కార్మికుడు ప్రమాదవశాత్తు వాగులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పోశం కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య ఎనిమిదేళ్ల క్రితం చనిపోవడంతో నలుగురు సంతానంతో కలిసి ఉంటున్నాడు. పనులు కోసం చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో పని కోసం తోటి కూలీలతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి కూలీలు చీకటి పడేంత వరకు వెతికినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం పోశం మృతదేహాన్ని గుర్తించారు. పోశం కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6: హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు తల్లిదండ్రులను కోల్పో యిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రెన్ హోం సంస్థల్లోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లలో 60 చొప్పున సీట్లు ఉన్నాయని, మొత్తం 240 సీట్లకు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల బాల రక్షాభవన్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కోసం సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖా స్తులను మే15 సాయంత్రం 5 గంటలలోపు ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఫోన్ 833-298-7862 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారిని చిదిమేసిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో 18 నెలల బాలుడి మృతి



సుధన్య(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 6: అప్పటి వరకు కుటుంబ సభ్యుల ముందు తప్పటడుగులు వేస్తూ.. వచ్చీ రాని మాటలతో అందరినీ ఆనందంలో ముంచెత్తిన ఆ చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ప్రాతంలో నివాసం ఉంటున్న పొట్ట రిషేంద్ర - అపూర్వ దంపతులకు కుమారుడు సుధన్య (18 నెలలు) ఉన్నాడు. శనివారం ఉదయం సుధన్య ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఆ ప్రాంతంలో మంచి నీళ్ల సరఫరా చేయడానికి వచ్చిన ఆటో ప్రమాదవశాత్తూ చిన్నారిని ఢీ కొట్టడంతో సుధన్య ఆటో చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. చిన్నారి తండ్రి రిషేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6: ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన నూర తిరుపతి(45) తన భార్య స్వరూపతో కలిసి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ నుండి పందిళ్లకు వస్తుండగా మార్గమధ్యలో పెగడపల్లి శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొంది. దీంతో నూర తిరుపతికి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి భార్య స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతికి భార్యతో పాటు కుమారుడు కూతురు ఉన్నారు. ఈ విషయంపై మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకొని తిరుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాంలోనే రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిచారు. మొదటి షిఫ్టులో 680 మందికి 608 మంది, రెండో షిఫ్టులో 672 మందికి 61 4 మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త కుండా తగిన ఏర్పాట్లు చేశామని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

నేతన్నలు ధైర్యం వీడొద్దు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

- రాజకీయపార్టీల వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభం
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6: సిరిసిల్ల మళ్లీ ఉరిశాలగా మారుపోతుందా అనే అను మానాలు వ్యక్తం అవుతున్నాయని, నేతన్నలు ధైర్యం వీడొద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి మూడు రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లేనన్నారు. కేంద్రం ప్రభుత్వం చేనేత, టెక్స్‌టైల్ శాఖలను రద్దు చేసి వస్త్ర పరిశ్రమలతోపాటు అనుబంధం రంగాల పరిశ్రమలపై 4 శాతం ఉన్న జీఎస్టీని 12 శాతానికి పెంచి భారం మోపిందని చెప్పారు. అంతేకాకుండా బహుళ జాతి కంపెనీలను ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో చిన్నచిన్న పరిశ్రమల్లో సంక్షోభం రావడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. సిరిసిల్లలో మూడు నెలలనుంచి వస్త్ర పరిశ్రమలు బంద్ కావడంతో నేతన్నలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నెల రోజుల్లో ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకారమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ఇతర వస్త్రాలకు సంబంధించిన బకాయిలతోపాటు యారన్ సబ్సిడీలను చెల్లించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోపంతో సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించకుండా కక్ష్యసాధింపులకు పాల్పడుతోందన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కల్పించేందుకు బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించాలంటూ నేతన్నలు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని చెప్పారు. ఈ సమస్యకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించి ప్రభుత్వంతో పోరాటం చేసి నేతన్నలకు ఉపాధిని కల్పించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంక్షోభంతో పాటు లక్షల్లో కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటని గతంలోనే



హాజరైన నేతన్నలు

పరిష్కారించాల్సి ఉండాల్సిందని చెప్పారు. అ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కరెంట్ బిల్లులు సైతం భారంగా మారిపోయా యన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులను ఓనర్‌లు చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకోచ్చిన వర్కర్ టూ ఓనర్ పథకం నిర్మాణాల దశలలోనే నిలిచిపోయిందని తెలిపారు. దీంతో ఇప్పటికి కార్మికులు ఓనర్‌లు కాలేకపోయారని అన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కోల్పోయిన నేతన్నలు భిక్షటనలు చేసుకోని భోజనం చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నేతన్నలు సమస్యలను పరిష్కారించు కునేందుకు నిత్యం పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికైనా సిరిసిల్లలో నేతన్నల అకలి చావులను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఉపాధిని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరపాటి రమేశ్, జేఏసీ నేతులు మండల సత్యం, మంచె శ్రీనివాస్, మూషం రమేష్, కోడం రమణ, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, పంతం రవి, వెల్దండి దేవదాస్, కట్టికోల లక్ష్మీనారాయణ, తాటిపాముల దామోదర్, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.

చల్మెడ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న చల్మెడ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ అసిమ్ అలీ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: చల్మెడ ఆసుపత్రి కమ్యునిటి మెడిసిన్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరుపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసిమ్ అలీ, డాక్టర్‌రాజమౌళి, సచిన్, డాక్టర్ ఫయాజ్, డాక్టర్ వజిద, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ కార్తీక్, తదదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



తుక్కుగూడ సభలో జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్6: హైదరాబాద్‌లోని తుక్కు గూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జానజాతర కార్యక్రమానికి కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

●జమ్మికుంట రూరల్: తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభ్యలకు హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట నుంచి ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున శనివారం తరలి వెళ్లారు. జై కాంగ్రెస్ జైజై కాంగ్రెస్ నినాదాలతో నాయకులు హోరెత్తించారు. ° సీనియర్ నాయకులు దేశిని కోటి, కౌన్సిలర్ బొంగోని వీరన్న, వీరనేని పరుశురామ్, పర్లపల్లి నాగారాజు, రాచపల్లి సాగర్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, రమేష్, దొగ్గల భాస్కర్, శేఖర్, సాయి, వంశీ, రజనికుమార్, అశ్విన్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

●సైదాపూర్: మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు తుక్కుగూడలో నిర్వహిం చే భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య తదితరులు ఉన్నారు.

●ఇల్లందకుంట: తుక్కుగూడ కాంగ్రెస్ జన జాతర సభకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ నాయకులు శనివారం భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో గుడేపు సారంగపాణి, వంగ రామకృష్ణ, ఎక్కటి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

●గంగాధర: తుక్కుగూడ సభకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్ తరలి వెళ్లారు. గంగాధరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

●తిమ్మాపూర్: హైదారాబాద్‌లోని తుక్కుగూడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు మండలం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.

●చిగురుమామిడి: జనజాతర మహాసభకు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు పోలు స్వప్న, జడ్పీటీసీ గీకురు రవీందర్ తదితరులు తుక్కుగూడ సభకు తరలివెళ్లారు.

'వైరాగ్యం'కు సాహితీసేవా ఉగాది పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 6: కరీంనగర్ భవానీ సాహిత్య వేదిక ద్వారా వైరాగ్యం ప్రభాకర్ 91 పుస్తకాలు ప్రచురించడంతోపాటు సాహితీరంగంలో చేస్తున్న విశేష సేవలను గుర్తించి ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆయనకు సాహితీసేవా ఉగాది పురస్కారాన్ని అందించింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో వైరాగ్యం ప్రభాకర్ పురస్కారాన్ని అందు కున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత ప్రభాకర్‌ను పలువురు కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 6: ఎన్నికలు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిం చాల ని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని కేశవపట్నం ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి శంకరపట్నం మండలం కొత్తగట్టులో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి పౌరుడు ఎన్నికల నిబంధనలకు లోబడే నడుచుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహ కరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి'

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: విద్యార్థి అభిలాష్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శనివారం కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని కలిసి ఫిర్యాదు చేసినట్లు జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్ నుంచి మార్చి1న అనుమతి లేకుండా బయటకి వెళ్లిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ మృతదేహం మార్చి 27న ఓ వ్యవసాయ బావిలో లభ్యమైం దని, దీనిపై విచారణ చేపట్టి నిజాలు తేల్చాలని కోరామని తెలిపారు. కొంత మంది తమ కళాశాలపై బురద జల్లాలని సోషల్ మీడియాలో, లోకల్ పేప ర్లలో తప్పుడు కథనాలు రాస్తూ తమ కళాశాల విధులకు భంగం కలిగిస్తున్నా రని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీని కోరామని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: స్థానిక శ్రీ చైతన్య ఫార్మసి కళాశాలలో శనివారం అపోలో ఫార్మసి నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికైన 58 మంది విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అభినందించారు. ఉద్యోగాలకు ఎంపికైనా విద్యార్థులకు 1.8 నుంచి 2.2లక్షల రూపాయల వార్షిక వేతనం లభించనుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ రామనర్సింహారెడ్డి, హెచ్ఓడీ రవీందర్, చంద్రమౌళి, రాం ప్రసాద్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్టీయూహెచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ కలెజియేట్ టోర్నమెంట్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు కబడ్డీ క్రీడల్లో పాల్గొని టీం ద్వితీయ బహుమతి సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జి వెంకటేశ్వర్లు, రామనరసింహారెడ్డి, ఏవో రామారావు, ఇన్‌చార్జి రమేశ్, పీడీ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

●హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో పాటు ఇతర బీజేపీ నాయకులు వారి నివాసం వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, కల్లెపు రేణుక, అంకటి శ్రీనివాస్, రాజు, సంజీవ్, వెంకటేష్, సారయ్య, రమా దేవి, రేణుక, రజిత, సమ్మయ్య, రవీందర్, రాజశేఖర్, రాజకుమార్, రమేష్, సాయి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

●జమ్మికుంట: పట్టణంలోని పార్టీ కార్యాల యంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, కోరె రవిందర్, పల్లపు రవి, రాగూర్ రాజేష్, బి రాజేష్, మోడెం రాజు, గండికోట సమ్మయ్య, కొండ్ల నాగేష్, బచ్చు శివకుమార్, రామ్, ప్రశాంత్, నిరుపరాణి, రవి, తదితరులు పాల్గొన్నారు.

●వీణవంక: మండలంలోని చల్లూరులో బీజేపీ నాయకులు జెండా ఆవిష్కారించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామిడి అదిరెడ్డి, నాయకులు నర్సింహరాజు, ఎనగంటి శ్రీనివాస్, సమ్మయ్య, అజయ్, శంకర్, నవీన్, గోపినాథ్, శ్రీనాథ్, సంప త్, శివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మట్ట పవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజు, ఓంకార్, సుధాకర్‌రెడ్డి, కిరణ్, సంపత్, మల్లయ్య, భాస్కర్, అశోక్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

●సైదాపూర్: బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల వ్యాప్తంగా నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు.

●మానకొండూర్: మానకొండూర్‌లో బీజేపీ నాయకులు జెండాను ఆవిష్కరిం చిన అనంతరం పార్టీ కార్యకర్తలతో టిఫి న్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కంది రాజిరెడ్డి, శ్రీనివా స్, కత్తి ప్రభాకర్, నందగిరి బలరాం తదితరులు పాల్గొన్నారు.

●రామడుగు: రామడుగు మండలం లోని దేశరాజ్‌పల్లి, రంగసాయిపల్లిలో బీజేపీ నాయకులు టిఫిన్ బైఠక్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జి ల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మండల ఉపాధ్యక్షు లు జాతరకొండ ఐలయ్య, మండల కార్యదర్శి వెల్ము ల రమేశ్, శక్తిం కేంద్రం ఇంచార్జి కట్టా రవీందర్, నాయకులు మునిగంటి శ్రీనివాసచారి, శేఖర్, రవి, శ్రీను, అశోక్, లచ్చయ్య, వెంకటనర్సు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

●చిగురుమామిడి: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పైడి పల్లి శ్రీనివాస్‌గౌడ్, రాగుల రవీందర్, కంది శంకర్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న గొలుసు అందజేత

భగత్‌నగర్; ఏప్రిల్ 6: ఆర్టీసీ బస్టాండ్‌లో పోగొట్టుకున్న రెండు తులాల బంగారు గొలుసును సెక్యూరిటి గార్డు కె ప్రభాకర్ ప్రయాణికురాలికి అందించి నిజాయితి చాటుకు న్నాడు. శనివారం బస్టాండ్‌లో బైరగొని లత అనే ప్రయాణి కురాలు రెండు తులాల బంగారు గొలుసును పోగొట్టుకుంది. ఆన్ డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు ప్రభాకర్‌కి దొరకడంతో ఎస్ఐకి అందించాడు. నిర్ధారణ చేసుకున్న అధికారులు ప్రయాణికురాలు లతకు బంగారు గొలుసును అందించారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి రజనీకృష్ణ, ఎస్ఐ సురేంద్రనాథ్, ఎఎస్ఐ లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

'విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు అన్నారు. స్థానిక పారమిత హెరిటేజ్ పాఠశాలలో నిర్వహించిన ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్ ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. రెండు దశాబ్దాలుగా ప్రాజెక్టు ఆధారిత అభ్యసన విద్యార్థులలో సమగ్ర అభివృద్ధిని చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 250 మంది విద్యార్థులతో అన్ని పారమిత శాఖల నుంచి 40 గ్రూపులు పాల్గొన్నాయి. జ్ఞానప్రబోధిని పూణే నుండి ప్రశాంత్ దివేకర్, సచికేత్, శ్రద్ధ ప్రత్యేక న్యాయ నిర్ణేతల బృందం, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్వేత, డాక్టర్ లావణ్య, ఉమెన్స్ కళాశాల అధ్యాపక బృందం ప్రాజెక్టులను మూల్యాంకనం చేశారు. ఈకార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, ప్రసూన, వినోద్‌రావు, వియుఎం ప్రసాద్, హన్మంత రావు, ప్రధానో పాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, ఏప్రిల్6: కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్ జన్మదినం సందర్భంగా శనివారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, మధు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రా యుధం లాంటిదని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్య క్షుడు ధనపురి సాగర్ అన్నారు. మీ ఓటే ప్రశ్నించే గొంతు కావాలని అన్నారు. శనివారం ప్రముఖ రచయిత, కవి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గండ్ర లక్ష్మన్‌రావు చేతుల మీదుగా నేను ఓటు తప్పక ఓటు వేస్తాను, మీరు కూడా ఓటు వేయండి, కాని డబ్బుకు ప్రలోభపడి కాదు, నాఓటే నా ఆయుదం అనే నినాదాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును ప్రలోభాలకు లొంగకుండా వినియోగిం చుకోవాలన్నారు. నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కొండకింది వేణుగోపాల్‌శర్మ, నక్క రాఘవేందర్‌రావు, రమణ, శ్రీనివాస్, రాజేందర్, ఆర్యన్ మహేం దర్, ఆకాశ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు

'కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యతాలోపం'



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 6: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతాలోపంతో మేడిగడ్డ వద్ద కుంగిపోయిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు. రైతుల కోసం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంట్లో దీక్ష చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. వేల కోట్ల అవినీతికి పాల్పడి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడడానికి కారణమైన కేసీఆర్ ఇంటి ముందు దీక్ష చేయాలన్నారు. నగర కాంగ్రెస్ కార్యాల యంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వం మరమ్మ తులు చేయకుండా ప్రాజె క్టులోని నీటిని వదిలిపెట్టడంతోనే నీటి కొరత ఏర్పడిందన్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు. అంత పెద్ద ప్రాజెక్టు కుంగిపోతే ఇసుక బస్తాలు వేస్తే ఆగుతుందని అనడం కేసీఆర్ ఎంత అవివేకో అర్థమవుతోందని నరేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు చర్ల పద్మ, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్‌కుమార్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సలీముద్దీన్, దన్న సింగ్, దండి రవీందర్, అబ్దుల్ బారి, జనగామ శరత్‌రావు, ఎండి చాంద్, కుర్రపోచయ్య, వంగల విద్యాసాగర్, నెల్లి నరేష్, పోరండ్ల రమేష్, కుంభాల రాజకుమార్, నాగుల సతీష్, గడప అజయ్, షబానా మహమ్మద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజలను మోసగించింది

- మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్



మానకొండూర్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మానకొండూర్, ఏప్రిల్ 6: అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసగించిందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృ ష్ణారావు రైతు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రస మయి బాలకిషన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అ ధికార దాహంతో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలతో తెలంగాణ ప్రజలను మో సం చేసిందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయ డమే కాకుండా రైతులు పండించిన క్వింటాలు ధాన్యానికి రూ. 500 బోనసు చె ల్లిస్తామన్నారు. నాలుగు నెలలు దాటిన రైతులకు ఇచ్చిన హమీలను నేర్చక మోసం చేస్తుందన్నారు. ఎండిపోయిన వరికి ఎకరాకు రూ. 25వేల నష్టపరిహా రం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మహలక్ష్మీ పథకం కింద తెలంగాణ లోని నిరుపేద మహిళలందరికి నెలకు రూ.2500 చెల్లిస్తామని గొప్పలు చెప్పిన రాష్ట్రప్రభుత్వం ఇప్పటికి అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. యాసంగి పంట కోతలు ప్రారంభమైనప్పటికి పూర్తి స్థాయిలో కొనుగోళ్ళు కేంద్రాలను ప్రా రంభించకపోడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ హ యంలో అన్ని వర్గాల ప్రభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తె లిపారు. పదేళ్లలో ఎకరం పంట ఎండిపోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రై తులతో పాటు రాష్ట్రప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు.. కార్యక్రమంలో జడ్పీటీసీలు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సిద్దం వేణు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: యాసంగిలో వేసిన వరి పంటలకు మరో 15రోజుల వరకు సాగునీరును విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తలపెట్టిన రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. దీక్షలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్, గందె రాధిక, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బండ శ్రీనివాస్, పింగిలి రమేశ్, పావని, వెంకటేష్, రేణుక, తిరుప తిరెడ్డి, రాణి, సురేందర్‌రెడ్డి, బక్కారెడ్డి, లక్ష్మణ్‌రావు, సాధవరెడ్డి, కొండాల్‌రెడ్డి, సంపత్‌రావు, ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణరావు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయా లని మాజీ ఏమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. చొప్పదండిలో శనివారం రైతు దీక్ష కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీంద ర్‌రెడ్డి, నాయకులు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, దూలం బాలాగౌడ్, మాచర్ల వినయ్, గడ్డం చుక్కారెడ్డి, కొత్త గంగారెడ్డి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో రైతు దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఫూలే జయంత్యుత్సవ కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, ఏప్రిల్ 6: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో శనివారం మహాత్మ జ్యోతిరావుఫూలే జ యంతి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర రాజకుమార్, గౌరవ అధ్యక్షులుగా గందె రాధిక-శ్రీనివాస్, చందుపట్ల జనార్దన్, సొల్లు బాబు, వేల్పుల రత్నం, సందేల వెంకన్న, ఎర్రబొజ్జు నారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చల్లూరి రఘుచారి, రామ్ సారయ్య, తాటిపాముల రాము, సొల్లు సునీత, ఎర్రబొజ్జు శారద, కార్యదర్శులుగా ఏనూరి అశోక్, దాట్ల ప్రభాకర్, వేల్పుల భాస్కర్, వేముల పుష్పలత, రావుల రాజేష్, ప్రచార కార్యదర్శిగా తులసి లక్ష్మణమూర్తిని ఎన్నుకున్నారు. సాం స్కృతిక కార్యదర్శులుగా రాం రాజేశ్వర్, కండె తిరుపతి, కోశాధికారిగా తాళ్లపల్లి అమరేందర్, గౌరవ సలహాదా రులుగా బుర్ర కుమార్, రొంటాల సుమన్, శేఖర్, సమ్మయ్య, ప్రసాద్, శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, శ్రీనివాస్, రాజు ఎన్నికయ్యారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

శంకరపట్నం, ఏప్రిల్ 6: మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో శ్రీధర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు చిన్న తరహా నీటి కుంటల్లో చేస్తున్న పనులను పరిశీలించి, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఎండవేడిమికి గురికాకుండా ఉదయం పూటే పనులు చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శారద, సెక్రటరీ స్వప్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాట్లపై సమీక్ష

శంకరపట్నం, ఏప్రిల్ 6: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం ఏర్పాటు చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాట్లపై ఎంఈవో వెంకటనర్సింహారెడ్డి సంబంధిత శాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామైక్య సంఘ అధ్యక్షులతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ప్రస్తుత స్థితిగతులు, మౌలిక వసతులపై చర్చించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతుల ఏర్పాట్లు, అభివృద్ధి పనులు తదితర అంశాలకు సంబంధించిన బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్వర్తిస్తుందని తెలిపారు. ఈ కమిటీ చైర్మన్‌గా వీవో అధ్యక్షురాలు, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయులు ఉంటారన్నారు. సమావేశంలో డీపీఎం రమణయ్య, బషీరుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీధర్, ఏపీఎం సుధాకర్, ప్రధానోపాధ్యాయులు, వీవో అధ్యక్షురాలులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఏప్రిల్6: నగరంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్1 ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. భగత్‌నగర్ ఏరియా, శివాలయం, పెద్దమ్మ గుడి, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, ఫకీరువాడ, ఎర్రగుట్ట కాలనీ, వాసుదేవ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. హౌసింగ్‌బోర్డు ఏరియా, విట్స్ కళాశాల ప్రాంతం, వరాహస్వామి ఆలయం, అల్గాపురి కాలనీ, హనుమాన్ నగర్, గణేష్‌నగర్ బైపాస్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

విద్యతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6: ప్రతి ఒక్కరూ విద్యతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సాకేత్‌రామారావు అన్నారు. స్థానిక కిమ్స్ డిగ్రీ, పిజి కళాశాలలో కామర్స్ విభాగం విద్యార్థులు సిగ్నిచర్‌డేను ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాలలో జరిగిన ఈకార్యక్రమానికి వైస్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మనిషి కష్టాల్లో ఉన్నపుడు ధైర్యాన్ని కోల్పోకుండా నిలబెట్టేది విద్యేనని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు రాబోయే పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో కామర్స్ విభాగం అధిపతి చంద్రమౌళి, అధ్యాపకులు సంపత్‌కుమార్, రమేశ్, రాజ్‌కుమార్, తిరుపతి, రాము, నరేశ్, స్వప్న, కల్యాణి, సంతోష్, మహేశ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 6: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మ్యాజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్, ఎన్ఈఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 350 మంది విద్యార్థినిలు పాల్గొనగా 140 మంది విద్యార్థినిలు ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సమత తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ కె గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅరబిందో సొసైటీల సన్నాహక సమావేశం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 6: తెలంగాణ జిల్లాల శ్రీ అరబిందో సొసైటీల ప్రాంతీయ సాధనా శిబిరం సన్నాహక సమావేశం జరిగింది. శనివారం స్థానిక జడ్పీ క్వార్టర్స్‌లోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో తెలంగాణ జిల్లాల శ్రీ అరబిందో సొసైటీల ప్రాంతీయ సాధనా శిబిరం నిర్వహిం చేందుకు ఏర్పాట్లపై ఈ సమావేశంలో చర్చించారు. శ్రీఅర బిందో సొసైటీ సెంటర్ అధ్యక్షుడు ఇంజనీర్ కోల అన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల శ్రీ అరబిందో సొసైటీల చైర్మన్ ములుగు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వరిగొండ కాంతారావు హాజరై ప్రాంతీయ సాధనా శిబిరం నిర్వహణ ఏర్పాట్లు, శ్రీఅరబిందో, శ్రీమాత బోధనల ఆవశ్యకతపై చర్చించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు సముద్రాలజనార్ధన్‌రావు, కార్యదర్శి కేశవరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చైత్రమాస వసంతోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 6: కరీంనగర్ మండలం నగు నూరులోని శ్రీ దుర్గాభవాని దేవాలయంలో సోమ వారం నుంచి చైత్ర మాస వసంతోత్సవాలు నిర్వ హిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. సోమవారం ఫల పంచామృ తాభిషేకం, మహాహారతి, ధ్వజారోహణం, మంగళవారం పుణ్యాహవచనం, కలశస్థాపన, ఉగాది పండుగ సంద ర్భంగా విశేష అలం కరణ, విశేష హారతులు, ఉదయం 11గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుం దన్నారు. నవరాత్రో త్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విశేష హారతి ఉంటుందన్నారు. 17వతేదీ ఉదయం పది గంటలకు చండీహోమం, మధ్యాహ్నం మహా పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 6: కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షురాలు లంక శ్రావణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై అవగాహన

రామడుగు, ఏప్రిల్ 6: మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల్లో మౌలిక వసతుల కల్పనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్కారు సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమంల్లో ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంఈవో వేణుకుమా ర్, ఏపీఎం ప్రభాకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సం ధ్యారాణి, ఏఈ సచిన్, ఉపాధ్యాయులు రాజమౌళి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి పైపులైన్లకు మరమ్మతులు

గంగాధర, ఏప్రిల్ 6: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో శనివారం తాగునీటి పైపులైన్లకు ప్రత్యేక అధికారి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి అంజయ్య ఆధ్వ ర్యంలో మరమ్మతు లు చేశారు. అవసరమున్న చోట కొత్త పైపులు, చేతి బోర్ల మరమ్మతులు చేస్తున్నారు. అంబేద్కర్ జయంతి, హనుమాన్ జయంతి, శ్రీరామనవమిని దృష్టిలో పెట్టుకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటు న్నామని కార్యదర్శి అంజయ్య తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వీణవంక, ఏప్రిల్ 6: మండలంలోని ఎల్బాక, గంగారం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. వీరి వెంట పింగిలి రమేశ్, బండ శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మాడ సాధవరెడ్డి, మావురపు విజయభాస్కర్ రెడ్డి, కొత్తి రెడ్డి కాంతారెడ్డి, పొన్నాల అనిల్, పింగిలి కోమాల్‌రెడ్డి, రాపర్తి అఖిల్, భూమయ్య ఉన్నారు.

●ఇల్లందకుంట, ఏప్రిల్ 6: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన విశ్వకర్మ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సురేష్‌చారి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం హుజూరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తిమ్మాపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని నేదునూర్ గ్రా మంలో వడదెబ్బతో మృతి చెందిన ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్ శనివారం పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుం బానికి పదివేల రూపాయలను అందజేశారు. కార్యక్ర మంలో మాజీ ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి కనకం కొమురయ్య, నాయకులు నూనె సురేష్, వంగల శ్రీనివాస్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయి బహుమతి

చొప్పదండి, ఏప్రిల్ 6: చొప్పదండిలోని సిద్ధార్థ పాఠశాల 6వ తరగతి విద్యార్థి ఏనుగు రిషిత ఒలింపి యాడ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతిని సాధించింది. సుచిత్ర ఫౌండేషన్ నిర్వహించిన సీవీ రామన్ జీనియస్ ఒలింపియాడ్ అవార్డులు ప్రకటించగా ప్రథమ బహు మతిని రిషిత సాధించిందిని డైరెక్టర్ కడారి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు.